


"మహామంత్రికి జయము."

"ఎవరు? గోవిందరాయలా! రా! కూచో."

"మహామంత్రులు ఏదో దీర్ఘాలోచనలో వున్నట్టుంది?"

"ఏముంది? నీకు తెలిసిన విషయమేగా."

"అంటే, నేటి క్లిష్ట సమస్యను ఎలా పరిష్కరించాలనేనా?"

"అవును."

"అప్పాజీ! మొట్టమొదట దిగ్విజయ యాత్రను చాలించి, స్వదేశానికి మరలిపో నిశ్చయించి, తిరిగి కటకం వరకు పాడిగించడంలో ప్రభువుల ఉద్దేశమేమిటి?

"అదంతా ఒక గాథలాంటిది."

"మీకేమీ అభ్యంతరం లేకపోతే అది వినాలని కుతూహలంగా వుంది""

"ఏముంది? రాయలు నరసరాజుకి ఔరస పుత్రుడు కాడని ప్రవాదమున్న సంగతి తెలుసుకదా!"

"ఔను. చంద్రుడికి మచ్చలా ప్రభువులకి దాసీపుత్రులన్న కళంకం ఒకటి ఉన్నది కదా!"

ఆ! ఆకళంకొన్ని కడిగివెయ్యాలని నా ప్రయత్నం."

"అయితే?"

"కటకపురాధీశ్వరుడైన వీర రుద్రగజపతి సుక్షత్రియుడు కదా! అతని పుత్రిక 'అన్నపూర్ణను' ప్రభువులకు రాణిగాచేస్తే ఆకళం

కం రూపుమాసి పోవచ్చునని నా ఊహ."

"మీ ఆలోచన అద్భుతమైనది. అలా చేస్తే వీరరుద్రగజపతివంటి బలాఢ్యుడి అండకూడా వుంటుంది."

"నేను గజపతికి నా ఉద్దేశాన్ని వ్యక్తీకరిస్తూ, ఒక లేఖ వ్రాసిపంపేను. ఆ లేఖచూసి అతను మన దూతను అవమానించి 'దాసీపుత్రునకు నా కుమార్తెనిచ్చి వంశాన్ని కళంకితం చేయదల్చుకోనలేదు. ఇటువంటి అవివేకపు జాబు లికముందు పంపకండి ఇది ప్రథమ తప్పిదం క్రింద మన్నిస్తున్నాం." అని వార్త పంపేరు.

"అన్నా! ఎంత పొగరు! తరువాత ఏం జరిగింది?"

"ఈ వార్త విని రాయలముఖం కెంపుబారింది. అతడు క్రోధంతో వొణికిపోయేరు 'ఏవిధంగా నయినా గజపతి కుమార్తెనే పరిగ్రహిస్తాను. లేకుంటే ప్రాణత్యాగం చేస్తాను' అని ప్రతిజ్ఞ చేసేరు. ఆ వెంటనే కటకపురికి సైన్యాలను మరలించడమైంది."

"అసలు విషయం ఇప్పుడు తెలిసింది. నిన్నటి యుద్ధపరిసితిని బట్టి చూస్తే విజయం అంత సుగమం కాదని నా అభిప్రాయం. విశ్రాంతిలేక మన సైనికులకి ఉత్సాహం, బలం, సన్నగిల్లుతోంది.

"ఔను. నిజమే."

"వీరరుద్రగజపతికి అతని సామంతులైన మహాపాత్రులు కుడిభుజం వంటివారు. వారి ప్రభుభక్తి అనుపమానం నిన్నటి యుద్ధంలో వారు చూపిన ప్రతిభ నిరుపమానమైనది."

"ఔను. పాత్రులందరూ గజపతితో కలసి ఉన్నంతకాలం మనకు విజయం సులభసాధ్యం కాదు."

"అప్పాజీ! అదనపు సైన్యాలని పంపమని రాజధానికి ఉత్తరం పంపేరా?"

"పంపేను కాని ఆ సైన్యాలు మనల్ని చేరే ముందుగానే ఇక్కడి పరిస్థితులు విషమిస్తాయేమో నని నాకు భయంగా వుంది"

"అదీ నిజమే. ఆ సైన్యాలు మనకి చేరేసరికి కనీసం నెలదినాలైనా పడుతుంది అదిగాక ఈ ప్రదేశం అంతా దుర్గమంగా వుంది. మనకు క్రొత్తది. అందుచేత పరిస్థితులు విషమించవచ్చు

"మన బలాలు చెక్కు చెదరకుండా గజపతిని వశం చేసుకోలేమా అని ఆలోచిస్తున్నాను."

"మీ బుద్ధికి అసాధ్యమైది దేది అప్పాజీ! ఆలోచించండి"

తిమ్మరుసు దీర్ఘాలోచనా నిమగ్నుడై ఒక్కక్షణం నిశ్శబ్దంగా ఉన్నాడు. మరుక్షణం అతని పెదవులపై విజయ సూచకమైన చిరునవ్వు వెలసింది. వెంటనే అతడు గోవిందరాయలను ప్రక్కగదిలోకి కొనిపోయి రహస్యంగా మంతనాలు సాగించేరు. పిమ్మట గోవిందరాయలు తన శిబిరానికి మరలిపోయేరు. తిమ్మరుసు వికసిత వదనంతో కృష్ణదేవరాయల శిబిరానికి బయలు దేరేరు.

అక్కడ కటకపురిదుర్గంలో వీరరుద్ర గజపతి తన ప్రధానమంత్రితో మంతనాలు సాగిస్తున్నాడు. తొలిరోజు యుద్ధంలో వారికి విజయం లభించినా మరునాడు అపజయమైంది. ఆనాడు నాయక పాత్రుడు యుద్ధానికి రాకపోడమే దీనికి కారణం అని వారి ఊహ. ఇంతలో నగర రక్షకులైన సైనికులు ఇద్దరు వ్యక్తులను గజపతిముందు నిలిపేరు. వారిని తీక్షణంగా చూసి గజపతి సైనికులతో "ఎవరు వీరు?" అన్నాడు. ఒక సైనికుడు ముందుకి వచ్చి ఇలా చెప్పేడు.

"ప్రభూ! వీరిద్దరూ విజయనగర సైనిక శిబిరాలనుండి మన మహాపాత్రుని గుడారం వంకకుపోతున్నారు. మాకు అనుమానం కలిగి 'ఎవరని' ప్రశ్నించేం. వీరు మామాటలు లక్ష్యపెట్టక ముందుకు సాగిపోయేరు. దండనాథులకు అనుమానం కల్గి వీరిద్దరినీ తమ సన్నిధికి పంపేరు"

**చారిత్రిక గాథ**

"ఎవరు మీరు?"

"జానపదులం"

"మహాపాత్రులతో మీకేం పని?"

"యాచన"

"నిజం చెప్పండి" అని గద్దించేరు గజపతి

"మేము చెప్పింది నిజమే!"

వెంటనే గజపతి కనుసన్నతో రెండు కొరడాలు వారివీపులపై పడ్డాయి. భయకంపితులై వారిద్దరూ "ప్రభూ! రక్షించండి. సత్యం మనవిచేస్తాం" అని మొరపెట్టుకున్నారు. గజపతి ఆజ్ఞతో శిక్ష ఆగింది. వారిద్దరూ ఒక లేఖను గజపతి సముఖంలో ఉంచి "ప్రభూ! ఈ లేఖను నాయక పాత్రులవారికి అందజేయమని తిమ్మరుసు మహామంత్రి మమ్మల్ని ఆజ్ఞాపించేరు. మాకేం తెలియదు ప్రభూ! జానపదులం. రక్షించండి" అని మొదపెట్టుకున్నారు. ప్రధాని లేఖతీసి ఇలా చదివేరు.

"శ్రీమన్మహామేరు సమాన ధీరులైన నాయకపాత్రులవారి సన్నిధికి తిమ్మరుసు మహామాత్యులు వ్రాసి పంపుకొను లేఖాంశములు.

మీరుకోరినప్రకారం మీకుస్వాతంత్ర్యం ప్రసాదించడానికి మా ప్రభువులు అంగీకరించేరు. కాబట్టి మీరు మాకు వాగ్దానం చేసిన ప్రకారం మూడు దినాలలో గజపతిని మాకు బందీగా అప్పజెప్పవలెను. మీరు రణరంగంనుండి పలాయితులౌతున్నట్టు నటించి పారిపోయిన యెడల మా సైనికులు విజృంభించి గజపతిని బంధించడానికి వీలు కలుగుతుంది. మీరు మాట తప్పరని విశ్వసిస్తాము.

ఇట్లు మీ
శ్రేయోభిలాషి
తిమ్మరుసు"

లేఖా పఠనం అవుతున్నంతసేపూ గజపతి తనేదో స్వప్నావస్థలో ఉన్నట్టు తలచేరు. ఎంత ద్రోహం! విశ్వాస పాత్రులని నమ్మి తన సర్వస్వం వారి హస్తగతం చేసేరు. చివరకు వారెంతద్రోహం చేయడానికి పూనుకున్నారు! అతడు జేవురించిన ముఖంతో ప్రధానిని చూసి "పాత్రులు ఇంతి ద్రోహానికి ఒడిగడతారంటే నమ్మలేకపోతున్నాను." అన్నాడు. "ప్రభూ! నేను మొదటనే మనవి చేసేను. సర్వస్వం వారి హస్తగతం చెయ్యవద్దని. ఇది తప్పక నమ్మదగ్గదే! అందు చేతనే నిన్నను నాయకపాత్రుడు యుద్ధంలో పాల్గొనలేదు"

ఈ సంభాషణ జరుగుతూండగా జానపదులిద్దరూ గజపతికి నమస్కరించి బయలు దేరేరు. సైనికులు వారినివారించేరు. కాని పరాకుగా వున్న గజపతి విడిచిపెట్టమని సంజ్ఞ చేసేరు. వారు బయటపడ్డారు.

ఇంతలో బయట ముట్టడి జరుగుతూన్న కోలాహలం అకస్మాత్తుగా వృద్ధిచెందింది. ఒక భటుడు రొప్పుతూ ప్రవేశించి పాత్రులందరూ పలాయితులౌతున్నట్టు తెలియజేసేరు. గజపతికి ఈ వార్తతో చేష్టలు తప్పిపోయేయి. చివరకు తెప్పరిల్లి అతడు ఇలా అన్నారు.

"మహామంత్రీ! ఇప్పుడుకర్తవ్యమేమిటి?"

"ప్రభూ! వెంటనే సంధి ప్రయత్నాల చేయించండి పిమ్మట కర్తవ్యాన్ని ఆలోచిద్దాం"

వెంటనే గజపతి కోటబురుజుమీద శాంతియుతంగా సంధి సంప్రదింపులను కాంక్షించే ధవళ పతాకం రెపరెపలాడింది. దానికోసమే ఎగురు చూస్తున్న తిమ్మరుసు వెంటనే యుద్ధాన్ని ఆపవలసిందిగా ఆజ్ఞలనిచ్చేరు. పిమ్మట రాయలు కోరిన షరతులకు అంగీకరిస్తూ దూతని పంపేరు గజపతి తిమ్మరుసు అన్నపూర్ణను రాయలకిచ్చి పాణిగ్రహణ మొనరించవలసిందిగా వార్త పంపేరు. గత్యంతరంలేక గజపతి అంగీకరించేరు.

గోవిందరాయలతో మంతనాలు ముగించి తిమ్మరుసు రాయలతోకూడ ఆలోచించి, ఇద్దరి సైనికులకు ఒక లేఖను ఇచ్చి, జాన

# మేధాశక్తి

శసుల వేషంతో ప్రాత్రుల శిబిరాలవైపు గజపతి సైనికులు చూస్తూండగా పొమ్మని ఆదేశించేడు. వారు పట్టుబడ్డ తరువాత వారు చెయ్యవలసిన విధానం అంతా వారికి ఉపదేశించేడు. వారిద్దరూ బంధిపబడిన వెంటనే తిమ్మరుసు సైనికులను హెచ్చరిస్తూ పెద్దకోలాహలం చేయించేడు. ఇంతలో "గజపతి మాయోపాయముచే పట్టుబడెను" అన్న కేకలు వినిపించేయి. ఆ శబ్దం గజపతి మందిరంవైపునుండి రావడంచేత అందరూ నమ్మేరు. ఆ కేకలు వేసిన వారు జానపదులమని చెప్పిన యిద్దరు వ్యక్తులే! గజపతివద్ద కొలవుతీసుకొని వస్తూ తిమ్మరుసు ఆదేశానుసారం అలా కేకలు వేసేరు. ఈ వార్త వినగానే సైన్యం చెల్లాచెదరైపోయింది. అదిచూసి విజయనగరం సైనికులు విజృంభించేరు. ప్రాత్రులు చేసేది లేక బలాలతో సహా పలాయితులయినారు. ప్రాత్రులు పలాయితులౌతున్నట్టు గజపతికి తెలిసింది. ఈ సంఘటన లేఖలో ఉన్న విధంగా జరిగిందని భావించేడు గజపతి. ఇంక తననెలాగైనా బంధిస్తారని భయపడి గజపతి సంధి సంప్రదింపులుచేసేడు. రాయల కోరిక ప్రకారం అన్నపూర్ణని అతనికిచ్చి వివాహమహోత్సవం జరిపించడానికి నిర్ణయమైంది.

వైవాహిక క్రియ అతివైభవంగా జరిగింది. రాయలు కవి గాయకులకు ఘనంగా సన్మానాలు చేసేడు, ఒక సభచేసి సామంతరాజుల నందరినీ ఉచితరీతిని సత్కరించేడు. దీంతో గజపతి సామంతులు అందరూ రాయల ఔదార్యాన్ని వేనోళ్లనుతించేరు. వివాహానంతరం రాయలు తన ప్రతిజ్ఞ తీరిందని సంతసించేడు. కాని తిమ్మరుసుమాత్రం గజపతిని పూర్తిగా నమ్మలేదు. రహస్యంగా చారుల్ని నియోగించి అతని చర్యల్ని ఎప్పటికప్పుడు తెల్సుకుంటున్నాడు. అంతఃపురంలో కూడా రహస్య సంచారుల్ని ఉంచేడు.

ఆ నాడు శోభనమహోత్సవం. శోభన గృహం అత్యద్భుతంగా అలంకరించేరు. నాటి రాత్రి శోభనగృహం ప్రవేశించబోయేముందు తిమ్మరుసు రాయలను ఏకాంతంగా కొనిపోయి రహస్యంగా కొన్ని సంగతులు ముచ్చటించేడు. తరువాత తిమ్మరుసు రాయలను శోభన గృహంలోకి సాగనంపి తాను నిష్క్రమించేడు. చెలికత్తెలు అన్నపూర్ణను కొనివచ్చి పడకటింట్లో ప్రవేశపెట్టేరు. వేడుకలు ముగిసిన పిమ్మట దంపతులను ఇద్దరినీ పాన్పుపై ఆసీనులవమన్నారు. పాన్పు సమీపిస్తూనే రాయలు తన చేతితో బలంగా పాన్పు నాలుగువైపులా తట్టేడు. వెంటనే పటపటమన్న శబ్దంతో కుట్లు తెగి దిండూ, బాలీసులూ అన్నీ లోతున ఎక్కడో నీటలోపడిన శబ్దం వినిపించింది. ఇంతలో అన్నపూర్ణ రాయల వక్షస్థలంపై బాకుతో పొడిచింది. బాకువంకరపోయిందే గాని రాయలకు హాని కలగలేదు. ఇంతలో బయట కోలాహలం చెలరేగింది. సైనికులతో ప్రవేశించి తిమ్మరుసు అన్నపూర్ణను ఖైదు చేసేడు. రాయలు ఆశ్చర్యపోతూ ఇలా అన్నాడు.

"అప్పాజీ! ఆమెను ఖైదు చెయ్యడం ఎందుకు? దీనికి మూలకారకుడు ఆ గజపతిని బంధించండి."

"రాజా! ఈమె నిజమైన అన్నపూర్ణ కాదు. చూడు." అంటూ మేలిముసుకుపటుకు లాగేడు. రాయల ఆశ్చర్యానికి మేర లేదు.

"ఆఁ! పురుషుడా! ఎవరితను?"

"ఇతను గజపతి ఉంపుడుకత్తె కుమారుడు. తండ్రి ఆజ్ఞవల్ల ఈ ఘాతుక కృత్యం చెయ్యడానికి పూనుకున్నాడు."

"నా కిదంతా అగమ్యంగా గోచరిస్తూంది."

"అసలు నీకు వివాహమైంది కూడా ఈ అన్నపూర్ణతోనే. నిజమైన అన్నపూర్ణ శుద్ధాంతంలో ఉంది."

ఇంతలో యిద్దరు భటులు ప్రవేశించి:

"ప్రభూ! గజపతి సారంగమార్గం ద్వారా పారిపోతున్నాడు." అని చెప్పేరు. తిమ్మరుసు నిశ్చలంగా "ఫరవాలేదు. గోవిందరాయలు జాగ్రత్తగా అతన్ని బంధించి తెస్తాడు" అన్నాడు.

రాయలు ఆశ్చర్యంగా "అప్పాజీ! మీకు ఈ కుట్ర సంగతి పూర్తిగా తెలుసా?"

"తెలుసు. అందుకనే నిన్ను లోన కవచం వేసికొనమని హెచ్చరించేను."

"ఔను. మీరు నన్ను కవచం వేసికొనమని హెచ్చరించి, పాన్పు గట్టిగా తట్టమని చెప్పినప్పుడే ఏదైనా కుట్ర జరిగి వుంటుందని ఊహించేను. మరి గజపతి పారిపోతాడని మీరెలా ఊహించేరు?"

"అతని ప్రయత్నాలుగాని వ్యర్థమైతే పలాయనం కావడానికి అన్ని యేర్పాట్లూ చేసే ఉంచేడు గజపతి. అది నాకు ముందే తెలిసింది. మన చారులు ఆ సారంగమార్గం ఎక్కడి వరకూ ఉన్నదో తెల్సుకున్నారు. గోవిందరాయలు ముందుగా కొంత సైన్యంతో వెళ్లి ఆ మార్గంలో ఒకచోట వేచి ఉన్నాడు. అతడు గజపతిని బంధిస్తాడు."

"అప్పాజీ! మీకు నా కృతజ్ఞతని ఎలా తెలియచెయ్యాలో నాకు తెలియడం లేదు."

ఇంతలో గోవిందరాయలు బందీకృతుడైన గజపతి కుటుంబంతో సహా ప్రవేశించేడు. తిమ్మరుసు అదరంగా చూసి:

"ఓహో! వీరరుద్రగజపతి మహారాజులా! దయచెయ్యండి." అన్నాడు.

రాయలు కోపంతో ఏదో అనబోయేడు. కాని తిమ్మరుసు కనుసన్నతో శాంతించేడు. తరువాత తిమ్మరుసు అతని చెవిలో ఏదో చెప్పేడు. వెంటనే రాయలు చిరునవ్వుతో గజపతి బంధాల్ని విడిపించి నమస్కరించేడు. రాయలు, తిమ్మరుసు చూపిన ఆదరానికి గజపతి సిగ్గుపడ్డాడు. అతని హృదయం పశ్చాత్తాపంతో నిండిపోయింది. ఆ తరువాత గజపతి మనస్ఫూర్తిగా అన్నపూర్ణను రాయలకిచ్చి అతి వైభవంగా వివాహం చేసేడు. ఈ విధంగా రాయలు విజలక్ష్మితో పాటు అన్నపూర్ణనుకూడ పరిగ్రహించి విజయనగరానికి మరలిపోయేడు.

ఈ విధంగా తిమ్మరుసు తన మేధాశక్తి వల్ల సామంతులకు, గజపతికి వైషమ్యాలు కల్పించి తనప్రభువుకు విజయం ప్రాప్తించేటట్టుచేసి, శోభన గృహంలో జరిగిన కుట్రనుకూడ తెలిసికొని రాయలకు ప్రాణదానం చేసి రక్షించేడు. ఆ తరువాత విజయనగరంలో జరిగిన విజయోత్సవ సభలలో రాయలు మహత్తర రాజకీయ ప్రజ్ఞాధురంధరుడు, శాంతమూర్తి, మేధాశక్తిసంపన్నుడు ఐన తిమ్మరుసును వేనోళ్ల నుతించి సన్మానించేడు. ★

శ్వేతకుష్ఠు
(తెల్ల మచ్చలు)
(గవర్నమెంట్ రిజిస్టర్డ్)
మావద్ద గల యీ మందును కొద్ది రోజులు వాడిన యెడల, శ్వేతకుష్ఠు, కుష్ఠు వ్యాధులు నయమగును. భయంకరమైన యీ వ్యాధిపోయి, మీరు ఆరోగ్యవంతులగుదురు. పై పూతకు, కడుపులోనికి మందు, ఒక్కొక్కటి ధర రు. 5. పనిచేయలేదని ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును. కోరినవారికి పూచీ.
Modern Drugs Corporation,
(108) P. O. Pakrıbarawan
(G a y a)